మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణికి నివాళి

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి ఇటీవల మృతి చెందడంతో.. గురువారం ఆయన సొంతూరు నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆవంచలో లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పరామర్శించారు. శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్, మాజీ ఎమ్మెల్యేలు పరామర్శించారు. –తిమ్మాజిపేట

రైతు ఆత్మహత్యలపై సర్కారు మొద్దునిద్ర

రుణమాఫీ కాక, రైతుభరోసా లేక ఆత్మహత్యలు

- రైతుల ప్రాణాలను రాష్ట్ర సర్కారే తీస్తున్నది
- రుణమాఫీ కాలేదని జగిత్యాల రైతు ఆత్మహత్యాయత్నం
- సీఎం ఢిల్లీ యాత్రలు బంద్‌జేసి రైతాంగం కన్నీళ్లు తుడవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రైతుల ఆత్మహత్యలపై రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు మొద్దునిద్ర పోతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కాక, రైతుభరోసా లేక పెట్టుబడి సాయం కరువైన పరిస్థితుల్లో ఎందరో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి సాయం చేయని కాంగ్రెస్ సర్కారే రైతుల ప్రాణాలను తీస్తున్నదని మండిపడ్డారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా బోగస్‌గా మారిందని దుయ్యబట్టారు. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణమాఫీ కాకపోవడంతో మేడ్చల్‌లో వ్యవసాయ కార్యాలయం సాక్షిగా సురేందర్‌రెడ్డి అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు భార్యాభర్తలిద్దరిలో ఒక్కరికీ రుణమాఫీ కాలేదన్న వేదనతో జగిత్యాలలో సాగర్‌రెడ్డి అనే రైతు పురుగుల మందు తాగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ద్రోహానికి ఇంకా ఎందరు రైతులు ప్రాణాలను బలిపెట్టాలని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.49,500 కోట్ల రుణమాఫీలో పావుశాతం కూడా చేయకుండా చేతులెత్తేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి రైతన్నలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఢిల్లీ యాత్రలు బంద్‌జేసి రైతాంగం కన్నీళ్లు తుడవాలని హితవు పలికారు. హిందీని దేశంలోని అందరిపై రుద్దాలనుకోవడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో అధికారికంగా 22 భాషలు ఉంటే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హిందీనే అందరికీ రుద్దాలనుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దేశంలోని 22 అధికారిక భాషల్లో హిందీ ఒకటని, ఎందుకు ఆ హిందీనే ఎక్కువగా మాట్లాడేలా ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీటి కోసం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు చెందిన మహిళలు రోడ్డెక్కారు. బోరు మోటర్ మరమ్మతుకుగురై నెల రోజులవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, భగీరథ నీరు సైతం రావడం లేదంటూ గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. – పెద్దవంగర

దళితబంధు లబ్ధిదారుల వినూత్న నిరసన

దళితబంధు రెండో విడత నిధుల కోసం పది నెలలుగా కలెక్టరేట్ చుట్టూ తిరిగినా ఫలితం లేదని దళితబంధు నిధుల సాధన సమితి హుజూరాబాద్ నియోజకవర్గ సభ్యులు మండిపడ్డారు. గురువారం వారు కరీంనగర్ జిల్లా వీణవంకలో మక్కజొన్న కంకులు అమ్ముకునే మహిళకు వినతిపత్రమిచ్చి నిరసన తెలిపారు. –వీణవంక

పాలు పారబోసి పాడిరైతుల నిరసన



పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో పాడి రైతులు ధర్నా చేపట్టారు. జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెళ్తున్నారన్న విషయం తెలుసుకొని రైతులు రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలిపారు. – జడ్చర్ల

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

లోవోల్టేజీతో నెలకు నాలుగు సార్లు ట్రాన్స్‌ఫార్మర్లు కాలుతున్నాయని, నీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జనగామ జిల్లా పాలకుర్తిలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. – పాలకుర్తి రూరల్

కాల్వల ద్వారా సాగునీరు ఇవ్వాలని నిరసన

ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగునీరు అందించాలని సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. గురువారం వెలిశాల డీబీఎం వద్ద ధర్నా చేపట్టారు. – తిరుమలగిరి

బాత్రూం డోర్లు పగులగొట్టి విద్యార్థినులపై దాడి

- స్నానాలు లేటుగా చేస్తున్నారని పీఈటీ దౌర్జన్యం
- సిరిసిల్ల ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో దారుణం
- విద్యార్థినుల ధర్నా.. పీఈటీని తొలగించిన డీఈవో రమేశ్

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని సిరిసిల్ల–సిద్దిపేట రహదారిపై బైఠాయించిన గిరిజన బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలోని తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలో దారుణం జరిగింది. విద్యార్థినులు ఆలస్యంగా స్నానాలు చేస్తున్నారనే నెపంతో వారిపై పీఈటీ జ్యోత్స్న విచక్షణా రహితంగా దాడి చేసింది. అంతేకాదు.. బాత్‌రూంల డోర్‌లు పగులగొట్టి, స్నానపు గదుల్లోనే సెల్‌ఫోన్‌తో వీడియోలు తీస్తూ కర్రతో చితకబాదింది. దీంతో ఆగ్రహించిన విద్యార్థినులు గురువారం తెల్లవారుజామున కళాశాల నుంచి బయటకొచ్చి బద్దెనపల్లిలోని సిరిసిల్ల–సిద్దిపేట రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. తెల్లవారుజామున విద్యార్థులు ధర్నా చేయడంతో స్థానికులు మీడియా, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థినులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. పీఈటీని సస్పెండ్ చేయాలని, ఎక్కడా పనిచేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఎంఈవో రఘుపతి అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే డీఈవో రమేశ్‌కుమార్‌తో ఫోన్‌లో సమస్యను వివరించగా.. పీఈటీ జ్యోత్స్నను రిమూవ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారని డీఈవో తెలిపారు. అనంతరం విద్యార్థులు కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఎంఈవో రఘుపతి పీఈటీ జ్యోత్స్నను రిమూవ్ చేశామని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్‌వీ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, జై భీం ఆర్మీ సంఘాల నేతలు కళాశాలకు చేరుకుని ఆందోళన చేశారు. పీఈటీ జ్యోత్స్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రిన్సిపాల్‌ను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సందర్శించారు. పాఠశాలలో సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్, ప్రిన్సిపాల్‌కు సూచించారు. పోలీసులు పీఈటీ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్టు తెలిపారు.

తెలంగాణ బిడ్డలపై సర్కార్ కక్ష

- 'స్థానికత'పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైద్యారోగ్య శాఖ
- జీవో-33పై మొండిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో వేలాది మంది విద్యార్థులు ఆగం
- నిలిచిపోయిన ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): డాక్టర్ కల సాకారం చేసుకోవానుకుంటున్న తెలంగాణ బిడ్డలపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నది. 'స్థానికత' నిర్ధారణలో వైద్యారోగ్య శాఖ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెడుతున్నది. కనీస అధ్యయనం లేకుండా హడావుడిగా జీవో 33ని తీసుకొచ్చి విద్యార్థులకు అన్యాయం చేసిన ప్రభుత్వం.. దాన్ని సవరించుకోవాల్సిందిపోయి మొండిగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ విద్యార్థులకు నష్టం కలుగకుండా స్థానికకోటా కింద అవకాశం కల్పించాలని, ఈ మేరకు నిబంధనలు రూపొందించాలని హైకోర్టు సూచించినా ప్రభుత్వం చెవికి ఎక్కలేదు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరపు న్యాయవాది ప్రతిపాదించారు. దీంతో త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం తెలిపింది.

ఎన్నిసార్లు మొత్తుకున్నా చెవికెక్కించుకోలే..

స్థానికతను నిర్ధారించడంలో ప్రభుత్వం మొదటి నుంచీ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. తెలంగాణ, ఏపీ మధ్య ఈ ఏడాది జూన్ 2తో 'ఉమ్మడి' బంధం శాశ్వతంగా ముగిసిపోతున్న నేపథ్యంలో స్థానికతను నిర్ధారించుకోవాలన్న సూచనలను ప్రభుత్వం పట్టించుకోలేదు. మెడికల్ సీట్లలో ఉమ్మడి కోటాపై నిర్ణయం తీసుకోవాలని, స్థానికతను నిర్ధారించాలని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ నుంచి ఈ ఏడాది జనవరిలోనే వైద్యారోగ్య శాఖ కార్యదర్శికి లేఖ రాసినట్టు చెప్తున్నారు. ఆ తర్వాత వైద్యశాఖ అంతర్గత సమావేశాల్లోనూ పలుమార్లు ఈ అంశం ప్రస్తావనకు వచ్చినా 'చూద్దాం లే' అన్న ధోరణిలో వ్యవహరించారు. 'స్థానికత'ను నిర్ధారించాలని ఇతర యూనివర్సిటీలు, సాంకేతిక విద్యాశాఖ నుంచి సైతం ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయి. కానీ పట్టించుకోలేదు. ఇంజినీరింగ్ ప్రవేశాల సమయంలోనూ ఉమ్మడి కోటాపై తర్జనభర్జనలు జరిగినా.. జూన్ 2వ తేదీకి ముందే అడ్మిషన్లు జరగడంతో కోటాను కొనసాగించారు. కానీ మెడికల్ సీట్లపై మాత్రం వైద్యారోగ్య శాఖ మీనమేషాలు లెక్కించింది. చివరికి పీకలమీదికి వచ్చిన తర్వాత జూలై 19న తూతూమంత్రంగా జీవో–33 ఇచ్చింది. వ్యతిరేకత వస్తుందన్న భయంతో జీవోను బహిర్గతం చేయకుండా రహస్యంగా ఉంచింది. రెండు వారాల తర్వాత అడ్మిషన్ల నోటిఫికేషన్‌తోపాటు విడుదల చేసింది. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలంగాణలో చదివిన వారిని మాత్రమే 'స్థానికులు'గా గుర్తిస్తామని పేర్కొన్నది. దీంతో ఇతర రాష్ట్రాల్లో మంచి విద్యాసంస్థల్లో చదివినవారు, ఉద్యోగరీత్యా తల్లిదండ్రుల బదిలీలు, ఇతర కారణాల వల్ల ఇంటర్ వేరే రాష్ట్రంలో చదివిన తెలంగాణ విద్యార్థులు స్థానికేతరులుగా మారిపోయారు.

న్యాయం చేయాలన్న కోర్టు.. పట్టించుకోని వైద్యశాఖ

జీవో 33ను రద్దు చేయాలంటూ హైకోర్టులో 53 వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నెల 5న తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో శాశ్వత నివాసం ఉంటున్న స్థానికులకు మెడికల్, డెంటల్ కాలేజీల్లో ప్రవేశాల్లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానికత వర్తించదనడం అన్యాయమని పేర్కొన్నది. ఒక విద్యార్థిని తెలంగాణ శాశ్వత నివాసిగా ఎలా గుర్తించాలో మార్గదర్శకాలు, నిబంధనలు లేవని గుర్తుచేసింది. హైకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే వైద్యారోగ్య శాఖ సమీక్షించి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. కానీ.. అలా జరగకుండా దాదాపు వారం రోజులు వృథా చేసి, చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కోర్టు తీర్పు వచ్చే వరకు అడ్మిషన్ల ప్రక్రియ నిలిచిపోయినట్టేనని వైద్యశాఖ వర్గాలు చెప్తున్నాయి. కనీసం హైకోర్టు తీర్పు వచ్చిన ఒకటి రెండు రోజుల్లో సుప్రీంకోర్టును ఆశ్రయించినా.. ఇప్పటివరకు ఏదో ఒకటి తేలిపోయేదని అంటున్నారు. రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాలు, దవాఖానాల్లో వసతులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం గత నెల 16వ తేదీన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. డీఎంఈ సభ్యకార్యదర్శిగా, డీఎంఈ (అకడమిక్), హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉన్నారు. తీర్పు వచ్చిన వెంటనే సమీక్షించకుండా టాస్క్‌ఫోర్స్ ఏం చేసిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏపీ ముందుచూపు..

స్థానికత నిర్ధారణలో ఏపీ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలకు స్థానికత, రిజర్వేషన్లపై అధ్యయనం చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి చైర్మన్‌గా, ఎనిమిది మంది ఉన్నతాధికారులు, అడ్మిషన్ల రంగంలో నిపుణులు ఒకరిని సభ్యులుగా కమిటీని ఏర్పాటుచేసింది. స్థానికత, ఉమ్మడి కోటా అంశంపై నిపుణులు, విద్యార్థులు, అసోసియేషన్ల నుంచి అభిప్రాయాలు తీసుకొని నివేదిక సమర్పించింది. ఈ మేరకు ఏపీలో స్థానికతను నిర్ధారించారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన ఎంబీబీఎస్, బీడీఎస్ నోటిఫికేషన్‌లో స్థానికతపై స్పష్టత ఇచ్చారు. వివిధ కారణాలతో స్థానికంగా ఇంటర్ చదవలేని వారికి 'ఏపీ నాన్‌లోకల్' స్టేటస్ ఇచ్చి, సీట్లలో కోటా ఇవ్వడంతో స్థానికతపై వివాదాలు తలెత్తలేదు.

హైకోర్టు ఆదేశించినా సీటు ఇవ్వరట!

- అన్ని అర్హతలున్నా స్పోర్ట్స్ కోటాలో ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి నిరాకరణ
- సాంకేతిక విద్యామండలి తీరుతో చెస్ క్రీడాకారుడు శ్రీశ్వాన్‌కు అన్యాయం

హైదరాబాద్, సెప్టెంబర్12(నమస్తే తెలంగాణ) : నిజామాబాద్ జిల్లా రెంజల్‌కు చెందిన శ్రీశ్వాన్ మరలాక్షరి వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో బ్రాంజ్, ఏసియన్ గేమ్స్‌లో గోల్డ్‌మెడల్స్ సాధించాడు. ఇటీవల ఎంసెట్‌లో 15వేల ర్యాంకు రాగా, స్పోర్ట్స్ కోటాలో టాప్ కాలేజీలో సీటు వస్తుందని కౌన్సెలింగ్‌కు హాజరయ్యాడు. కానీ, సాంకేతిక విద్యామండలి తిరస్కరించింది. హైకోర్టును ఆశ్రయించగా స్పోర్ట్స్ కోటాకు అర్హుడని ఆదేశాలిచ్చింది. అయినా అధికారులు పట్టించుకోకుండా టాప్ కాలేజీల్లో సీట్లు భర్తీ అయ్యాయని, తక్కువస్థాయి కాలేజీల్లో సీటు ఇస్తామని మెలికపెడుతున్నట్టు శ్రీశ్వాన్ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్జీఎఫ్‌లో రాణించిన వారికి స్పోర్ట్స్ కోటాలో టాప్ కాలేజీల్లో సీటు ఇచ్చారని ఆరోపించారు. తమ కుమారుడికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

బిల్లు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డిలోని ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ పాండురంగారావు రూ.55 లక్షలు వెచ్చించి అదనపు తరగతి గదులు నిర్మించారు. అప్పు చేసి పనులు పూర్తిచేసినా బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురైన కాంట్రాక్టర్.. గురువారం గదులకు తాళం వేశారు. దీనిపై డీఈవో రాజును వివరణ కోరగా.. ప్రభుత్వం మారడంతో బిల్లులకు ఆలస్యమైందని, ప్రభుత్వానికి నివేదిక పంపి బిల్లు చెల్లించేలా చూస్తామని తెలిపారు. – కామారెడ్డి

బడిలోకి దూరిన మొసలి

జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం గుడ్డెందొడ్డి పాఠశాలలోకి గురువారం భారీ మొసలి వచ్చింది. రైతుల ద్వారా సమాచారం అందుకున్న అటవీ అధికారులు అక్కడికి వచ్చి మొసలిని బంధించి జూరాల డ్యాంలో వదిలిపెట్టారు. – ధరూరు

బోయినిపేటలో పునుగు పిల్లి

పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలో పునుగుపిల్లి సంచరిస్తుంది. బుధవారం రాత్రి మూగ ప్రకాశ్ అనే యువకుడు తాను పెంచుకుంటున్న కోళ్ల బోనులోకి వెళ్లిన ఈ పునుగు పిల్లి కోళ్లను చంపుకొని తిని అందులోనే చిక్కుకు పోయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు అటవీ అధికారులు దాన్ని పట్టుకొని అడవిలో సురక్షితంగా వదిలి పెట్టారు. – మంథని

'మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయండి'

- తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జేఏసీ
- సుప్రీం తీర్పును అమలుచేయాలని డిప్యూటీ సీఎంకు వినతి

డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న వర్సిటీల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 12: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీల అభివృద్ధిలో తమ పాత్రనే ఎక్కువగా ఉన్నదని, ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా వర్సిటీల్లో అమలు కావడం లేదన్నారు. తక్షణమే ఉద్యోగాలను పర్మినెంట్ చేసి, తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పీ సురేశ్, రాము మైలారం, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లలను పంపిణీ చేయాలి

- మత్స్యశాఖ కమిషనరేట్ ఎదుట బైఠాయించిన మత్స్యకారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపపిల్లల పంపిణీ ప్రారంభించాలని, లేనిపక్షంలో లక్షమందితో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని మత్స్యకారులు హెచ్చరించారు. మత్స్యశాఖ కమిషనరేట్ భవనం ఎదుట మత్స్యకారులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం నేత రంజిత్ ముదిరాజ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఓ వైపు చెరువులు, కుంటలు కబ్జా చేస్తే ఊరుకోబోమంటూ హైడ్రా పేరుతో డ్రామా చేస్తున్నారని, మరో వైపు అవే చెరువులు, కుంటలపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. చేపల సీడ్‌ను 100శాతానికి పెంచి వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.